క్లుప్తంగా

ఉపముఖ్యమంత్రిని కలిసిన స్థానిక నేతలు



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అబ్దుల్ ఘనీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఘనీ ఆదివారం మర్యాద పూర్వంగా కలిశారు. ఆయనతో స్థానిక నాయకులు షేక్ అబ్దుల్ ఖదీర్, షేక్ అబ్దుల్ వాసీం ఉన్నారు.

ఉపాధి కల్పన మంచి పరిణామం

కాంగ్రెస్ నేత నీలం మధు



హాలును ప్రారంభిస్తున్న మధు

పటాన్‌చెరు టౌన్: యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం చూడకుండా సొంతంగా ఉపాధి పొందుతూ నలుగురికి ఉద్యోగాలు కల్పించే దిశగా సాగడం మంచి పరిణామం అని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ముత్తంగి పంచాయతీ పరిధిలో సిరిబ్యాంకెట్ హాలును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువత వ్యాపారంగంలో రాణిస్తూ ఉపాధి కల్పనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, అశోక్, సంజీవ్, నారాయణరెడ్డి, ప్రవీణ్, రాజు, బాలరాజు, అనిల్, కృష్ణ, మహిపాల్ రెడ్డి, నర్సింహ, వీరన్న, వెంకటేశ్, మురళీ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఊట్ల గ్రామంలో ఆదివారం గంగమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కాంగ్రెస్ నేత నీలం మధు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మత్స్య సహకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం పనులు ముమ్మరం



మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల్లో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని తాటిపల్లి గ్రామంతోపాటు ఆయా గ్రామాల్లో ఆదివారం మురుగు కాలువల నిర్మాణం, అంతర్గత రోడ్ల పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపట్టామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బలరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖకు రాష్ట్రంలో మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వాపోయారు.

ప్రభుత్వ భూమిని దున్నడంపై ఫిర్యాదు



దున్నిన ప్రభుత్వ స్థలం

జిన్నారం(పటాన్‌చెరు): ఖాజీపల్లి గ్రామంలోని 181సర్వే నంబర్‌గల ప్రభుత్వ భూమిలో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం దుక్కిదున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తూ దుక్కిదున్నడంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.

రైతుల నెత్తిన పిడుగులు

- నెల రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి
- బాధితుల్లో రైతులు, పశువులే ఎక్కువ
- అవగాహనతో ప్రాణనష్టం తగ్గించవచ్చు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



వర్షాకాలంలో పిడుగులు మనుషులు, మూగ జీవాల ప్రాణాలు బలితీసుకుంటాయి. వేసవి ముగియగానే రుతుపవనాలు ప్రారంభమవుతాయి. అలాగే తుఫాన్‌లు ఏర్పడి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయి. ఆ సమయంలో భయంకరమైన పిడుగులు పడుతుంటాయి. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పిడుగుల తీవ్రత మరింత పెరిగింది. దీంతో చాలా చోట్ల పిడుగుపాటుకు రైతులు, మూగ జీవాలు బలవుతున్నాయి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే కొంత వరకు ప్రాణనష్టం తగ్గించవచ్చని వాతావరణ నిపుణులు చెపుతున్నారు.

– వట్‌పల్లి(అందోల్)

కొన్నివేల మెగావాట్ల శక్తి కలిగిన పిడుగులు అటు జీవుల ప్రాణాలు తీయడంతోపాటు విలువైన వస్తువులను కాల్చి బూడిద చేస్తుంటాయి. వర్షాకాలం ఆరంభంలో మేఘాల ఘర్షణ వల్ల పిడుగులు పడుతుంటాయి. వర్షాలు ప్రారంభం కాగానే అప్రమత్తంగా ఉంటే పిడుగుల బారినుంచి కొంత వరకు బయట పడవచ్చు.

వరుస మృతులతో బెంబేలు

జూన్ 12న అందోలు మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో అందోలు అంజమ్మ అనే మహిళా రైతు పొలం పనులకు వెళ్లి వర్షానికి చెట్టుకింద తలదాచుకున్న సమయంలో పిడుగుపాటుకు గురై మరణించింది. జూన్ 5న చౌటకూర్ మండల పరిధిలోని సరఫ్‌పల్లిలో గేదె పిడుగుపాటుతో మరణించింది. మే 7న అందోలు మండల పరిధిలోని ఎర్రారం గ్రామంలో రైతు పాపయ్య ఎడ్లకు తోలుకొని వస్తున్న క్రమంలో పిడుగుపడి మృత్యువాత పడ్డాడు. ఇలా జిల్లాలో పిడుగు పాటుకు గురై మృతి చెందిన వరుస ఘటనలు హడలెత్తిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలో అందోలు మండలంలో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృత్యువాత పడడంపై మండల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



అంజమ్మ మృతదేహం



రైతు పాపయ్య(ఫైల్)

చెట్ల కింద ఉండడం ప్రమాదకరం

పిడుగులు పడే సూచనలు కనిపించే చెట్ల కిందకు వెళ్లడం మంచిది కాదు. పిడుగులు భూమి మీదకు వచ్చే సమయంలో ఎత్తయిన చెట్లు, పచ్చిక మైదానాలు, కొండలు, లోహాలను ఆకర్షిస్తాయి. చెట్ల కింద నిలుచున్న సమయంలో పిడుగులు పడితే ఆ శక్తి మనుషుల నుంచి ప్రసరించి ప్రమాదాల బారిన పడతారు. ఆ సమయంలో నిలబడి ఉండడం కంటే నేలపై పడుకోవడం వల్ల ప్రమాద తీవ్రత తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

అప్రమత్తతతోనే రక్ష

పిడుగుల బారి నుంచి తప్పించుకోవడానికి అప్రమత్తతతో వ్యవహరించాలి. గాలులు వీస్తున్నా, ఉరుములు ఉరిమినా పిడుగులుపడే ప్రమాదం ఉంటుంది. ఆ సమయంలో సమీపంలోగల పెద్ద భవనాల్లోకి వెళ్లడం మంచిది. ఉరుములు, మెరుపులు, గాలివాన సమయంలో ద్విచక్ర వాహనాలు నడపడం మానుకోవాలి. లోహపు వస్తువులను తాకకుండా ఉండాలి. బహిరంగ ప్రదేశాల్లో సెల్‌ఫోన్ వినియోగించవద్దు. ఉరుములు, మెరుపుల సమయంలో ఇళ్లలో తలుపులు, కిటికీలు మూసివేయాలి. ఇంట్లో విద్యుత్‌తో నడిచే అన్ని వస్తువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని అధికారులు చెపుతున్నారు.

ఉరుములు.. మెరుపులతో జాగ్రత్త

ఆకాశంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేసందర్భాల్లో ఏదో ఒకచోట పిడుగుపాటుకు గురై మృత్యువాత పడుతున్నారు. మూగజీవాలు సైతం పిడుగులకు బలై పోతున్నాయి. అధిక శాతం మంది వ్యవసాయ భూముల్లో పనిచేసుకునే రైతులు, కూలీలే ఎక్కువగా ఉంటున్నారు. పిడుగు శబ్దానికి కొందరు ప్రాణాలు వదులుతుండగా, ఇంకొందరు దాని తీవ్రతకు బలవుతున్నారు.

తక్షణమే చికిత్స అందించాలి..

వానాకాలం సీజన్‌లో పిడుగుపాటుకు గురైన వ్యక్తులకు తక్షణమే చికిత్స అందించడానికి కుటుంబ సభ్యులు, ఇరుగు, పొరుగువారు ప్రయత్నించాలి. సమీపంలో ఉన్న వైద్యశాలకు తీసుకువెళ్లాలి. శరీరం కాలి గాయపడడం, అకస్మాత్తుగా గుండెపోటు రావడం, పిడుగు శబ్దానికి చెవులు పనిచేయకపోవడం వంటి ప్రమాదాలు జరుగుతుంటాయి. సరైన సమయంలో చికిత్స అందించడం వల్ల కొంత మేలు కలిగే అవకాశాలున్నాయి.

– డాక్టర్.రమేశ్,
జోగిపేట ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర మాజీ శాసనమండలి నేత వెన్నవరం భూపాల్ రెడ్డి సూచించారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో ధ్రువ విజయ హెల్త్ కేర్ సర్వీస్ సంస్థ 5వ వార్షికోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలని యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌టీయూను గెలిపించండి...

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని జీకే ఫెన్నార్ పరిశ్రమలో త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్‌టీయూ కార్మిక సంఘాన్ని గెలిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పరిశ్రమ జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. వివిధ పరిశ్రమల్లో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయడంతోపాటు, కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేశామని చెప్పారు. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, సంఘం ప్రతినిధులు తిరుపతి గౌడ్, నవీన్ కుమార్, శ్రీనివాసరావు, యాదగిరి, నరసయ్య, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఆలయాల వద్ద మురుగు



నిలిచిన మురుగునీరు

- నిలిచిన నీటితో ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పాతబస్తీలోని మాణిక్‌ప్రభు వీధి ప్రాంతంలో గ్రామ దేవతల ఆలయాల వద్ద నిలిచిన మురుగునీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆ వీధిలోనే ప్రతి శుక్రవారం సంతకూడా జరుగుతుంది. గుడుల ఎదుట జనావాసాల మధ్య నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద కూడా ఎక్కువైందని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం తక్కువగా ఉండడం, మరోపక్క మురుగునీరు నిలిచిపోవడంతో వ్యాపారులు, ప్రజలు నానాఅవస్థ పడుతున్నారు. గ్రామదేవతల గుడుల వద్ద గుంతలు ఏర్పడడం వల్లే నీరు నిలుస్తుందని కాలనీవాసులు వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అందరూ భాగస్వాములవ్వండి



స్వచ్ఛ కార్యక్రమానికి సిద్ధమైన గ్రీన్‌ఆర్మీ ప్రతినిధులు

మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సేవ్ లేక్, సేవ్ వాటర్ ఉద్యమంలో భాగంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెలికుంట చెరువు పరిసర ప్రాంతంలోని చెత్తను తెల్లాపూర్ నైబర్‌హుడ్ గ్రీన్‌ఆర్మీ సభ్యులు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డితో పాటు సుమారు 50 మంది ఐటీ నిపుణులు, చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యంలో ప్రతిఆదివారం చెరువు పరిసర ప్రాంతంలో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టడం హర్షణీయం అని ప్రశంసించారు. దీనిలో ప్రతి ఒక్కరు భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని వారి వంతుగా చెత్తను తొలగించారని చెప్పారు. అదేవిధంగా తాము కూడా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు: ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు ఓ బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. పాత రామచంద్రపురానికి చెందిన స్వాతి తన కుమారుడు విష్ణును గత 10వ తేదీన హత్యచేసి మరోవ్యక్తి సహాయంతో ముత్తంగి సర్వీస్ రోడ్డు పక్కన పడేసిన విషయం తెలిసిందే. ఫౌండేషన్ అధ్యక్షుడు మధు మాట్లాడుతూ ఆ బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎండీఆర్ ఫౌండేషన్‌కు అప్పగించారన్నారు. ఈ మేరకు ఫౌండేషన్ సభ్యులు బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

టోల్ ప్లాజా వద్ద ఘర్షణ

సంగారెడ్డి: తాడ్‌దాన్‌పల్లి జాతీయరహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం ఘర్షణ చోటుచేసుకుంది. ఓ వాహనదారుడు, టోల్‌ప్లాజా సిబ్బందికి మధ్య వాగ్వివాదం నెలకొంది. లోకల్ వాహనదారుడి వద్ద కూడా అధిక రుసుము వసూలు చేస్తున్నారని టోల్‌ప్లాజా సిబ్బందిని అడగ్గా వారు గొడవకు దిగారు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ తీవ్రమైంది. పుల్కల్ పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు.

వ్యర్థాల కోసమే కవర్‌ల పంపిణీ

కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: పంపిణీ చేసిన కవర్‌లలోనే వ్యర్థాలు వేయాలని వాటిని జీహెచ్ఎంసీ సిబ్బంది సేకరిస్తారని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ చెప్పారు. బక్రీద్ సందర్భంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మజీద్‌లతోపాటు ముస్లింలకు ఆదివారం ఆయన ప్లాస్టిక్ కవర్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మాంసాహార వ్యర్థాలను చెత్త కుండీల వద్ద పడివేస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వాటిని ప్లాస్టిక్ కవర్లలోనే వేసి పారిశుద్ధ్య వాహనాలకు అందజేయాలని కోరారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. ముస్లింలకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

బక్రీద్ ఏర్పాట్లు పరిశీలించిన కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని ఈద్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను కార్పొరేటర్ పుష్పనగేష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగను కుల, మతాలకు అతీతంగా మంచి వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. బక్రీద్ పండగ రోజు చెత్తను జీహెచ్ఎంసీ పంపిణీచేస్తున్న డస్ట్‌బిన్ కవర్స్‌లోనే వేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, అబ్దుల్ గఫార్, అక్బర్, యాసీన్, సబీర్, మల్లేశం పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి..

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పాతరామచంద్రాపురంలో కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ సమస్యను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు నిధులను మంజూరు చేయించామని, వారం రోజుల్లో పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట భాస్కర్, రాములు, సత్తి, జంగయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.



కవర్లను అందజేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్



డస్ట్‌బిన్ కవర్‌లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాలు



ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న స్వరూప్

నారాయణఖేడ్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని వ్యర్థాల సేకరణకు సోమవారం చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ తెలిపారు. పండుగ నేపథ్యంలో ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యర్థాలను బయట పడేయకుండా తాము పంపిణీ చేస్తున్న పాలిథిన్ కవర్లలోనే వేయాలని సూచించారు. పట్టణ శివారులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరుపుకొనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. కాలనీలవారీగా వచ్చే చెత్త సేకరణ వాహనాల డ్రైవర్ల ఫోన్ నెంబర్లను వారికి అందజేశారు.

రేపు ప్రతిష్ఠాపన మహోత్సవాలు

నారాయణఖేడ్: స్థానిక దత్తాత్రేయ ఆలయంలో వైభవంగా ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, 10గంటల నుంచి రాత్రి వరకు యజ్ఞం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాదాల వితరణ, ఆధ్యాత్మిక ధర్మసభ తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం

పటాన్‌చెరు: విద్యార్థిదశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలోని కేజీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన సైక్లాన్ బ్యాడ్మింటన్ అకాడమీని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజు, చంద్రకళ గోపాల్, కృష్ణ, సీనియర్ నాయకులు యాదగిరి, ప్రభాకర్ రెడ్డి, యాదగిరి, అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ అకాడమీని ప్రారంభిస్తున్న పాండురంగారెడ్డి తదితరులు

భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన నిర్వహించారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయం, ఎన్‌జీవోస్ తదితర కాలనీల్లో భక్తులు కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. మహిళలు, పిల్లలు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఈ నగర సంకీర్తన కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రతివారం భక్తుల సంఖ్య పెరుగుతోందని, అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గోవధపై చర్యలు తీసుకోవాలని వినతి



జహీరాబాద్: వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

జహీరాబాద్: బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఆదివారం కోహీర్ మండలానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పోలీసులకు వినతి పత్రం అందజేశారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు గోవధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. అనంతరం జరిగిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బీజేపీ కార్యకర్తలు నిఘా వేసి ఉంచాలన్నారు. గోవులపై అఘాయిత్యానికి పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో కిష్టన్న, సతీశ్, నర్సింహులు, రమేశ్, నరేశ్, విజయేందర్, చంద్రశేఖర్, సంతోష్, వంశవర్ధన్‌రెడ్డి, గోపాల్, ప్రశాంత్, శ్రీనివాస్, మల్లేశ్, వెంకట్ పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు)లో..

బక్రీద్ సందర్భంగా గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలని గుమ్మడిదల పీఎస్‌లో బీజేపీ నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. జిన్నారంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో గోవధకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ఊరడమ్మ తల్లి వార్షికోత్సవం

నారాయణఖేడ్: మనూరు మండలంలోని పుల్‌కుర్తి గ్రామంలో సోమవారం ఊరడమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవాలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 8గంటలకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామపెద్ద మహిపాల్ రెడ్డి కోరారు.